నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I | హైదరాబాద్, సోమవారం 24 జూన్ 2024 | RANGAREDDY



## సీఎంను కలిసిన వికారాబాద్ కలెక్టర్

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదివారం సీఎం రేవంత్ రెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి.. మొక్కను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి అందేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టర్‌కు సూచించారు.

–వికారాబాద్, జూన్ 23



సమావేశంలో మాట్లాడుతున్న శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్

## యువతకు మెగా జాబ్ మేళా

**నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కృషి : శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్**

వికారాబాద్, జూన్ 23 : నిరుద్యోగ సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆదివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని నర్సింగ్ ఫంక్షన్ హాల్‌లో యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ముందుగా ఆయన జడ్పీచైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితో కలిసి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ మేళాలో 70 కంపెనీల్లో 5000 ఉద్యోగాలకు ఏడోతరగతి నుంచి పీజీ పూర్తి చేసిన 18 నుంచి 35 ఏండ్లలోపు వయసు గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా శాసనసభా పతి మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందు కే మెగా జాబ్‌మేళాను నిర్వహించడం జరిగిందన్నారు.

ప్రభుత్వం ఏర్పడిన అతి తక్కువ కాలంలోనే 30 వేల ఉద్యోగాలను కల్పించడం జరిగిందని.. మరో 1.70 లక్షల ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో కడ (కొడంగల్ ప్రాంత అభివృద్ధి సంస్థ) ద్వారా పరిశ్రమలు నెలకొల్పి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేలా ముమ్మర చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను నెరవేర్చడంతోపాటు ఐదేండ్లలో నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామన్నారు. అనంతరం జడ్పీచైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతకు మెగా జాబ్‌మేళా ఎంతగానో దోహదపడుతుందన్నారు. యువత ఉద్యోగాల్లేవని చింతించకుండా వ్యవసాయ రంగంలో రాణించాలని సూచించారు. అనంతరం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ యువత విద్యతోపాటు తమలోని ప్రతిభనూ మెరుగుపరచుకోవాలన్నారు. యువత ఉద్యోగాలు సాధించి తమ కుటుంబాలకు అండగా ఉండాలని సూచించారు. మెగా జాబ్‌మేళాలో ఉద్యోగాలు పొందిన పలువురు అభ్యర్థులకు శాసనసభాపతి ప్రసాద్‌కుమార్ నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారమేశ్, ఎంపీపీ చంద్రకళ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్ రెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, వేణుగోపాల్ రావు, జడ్పీ సీఈవో సుధీర్, డీవైఎస్‌వో హనుమంతరావు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.



జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగులు

### గతంలో వ్యవసాయానికి ఇబ్బంది లేకుండే..



కేసీఆర్ పాలనలోనే వ్యవసాయానికి ఇబ్బంది లేకుండే. 2014 కంటే ముందు కాంగ్రెస్ పాలనలో సాగుకు కరెంటు నిరంతరం ఉండేదికాదు. రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ వ్యవసాయానికి 24 గంటలూ విద్యుత్తును అందించారు. పదేండ్లలో ఎలాంటి ఆటంకాలు లేవు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే విద్యుత్తు కోతలు మొదలయ్యాయి.


–పి.నర్సింహారెడ్డి రైతు, మోమిన్‌ఖుర్దు, ధారూరు మండలం

### పాతరోజులను గుర్తు చేస్తున్నాయి..



ప్రస్తుత కరెంటు సమస్యలతో సమైక్య రాష్ట్రంలోని పాత రోజులు గుర్తుకు వస్తున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 24 గంటల నిరంతర కరెంటు సరఫరా అయ్యేది. మా ఊర్లో ఎక్కువ మంది కూరగాయలు, ఉల్లి పంటలు పండిస్తారు. కాంగ్రెస్ వచ్చినప్పటి నుంచి త్రీఫేజ్ కరెంటు ఉండటంలేదు.

–విజయ్, పంచలింగాల్, మర్పల్లి మండలం



### కరెంట్ కోతలతో తిప్పలు

కేసీఆర్ హయాంలో కరెంటు సమస్యలు అంటే ఏంటో రైతులకు తెలిసేది కాదు. అప్పుడు 24 గంటలూ కరెంటు ఉండేది. దీంతో రైతన్న పంటలకు సరిపడా నీళ్లు అందించి వ్యవసాయాన్ని పండుగలా చేసుకునేవాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కరెంటు కోతలతో రైతుల బాధలు వర్ణనాతీతం. ఆనాటి రోజులను మళ్లీ రైతులు చూసే పరిస్థితి ప్రస్తుతం ఏర్పడుతున్నది. మాజీ సీఎం కేసీఆర్‌ను విమర్శించడం మానేసి రైతుల శ్రేయస్సు కోసం సరిపడా విద్యుత్తు అందించాలి.

–ముక్తార్, రైతు, ఆలేడ్, కొడంగల్

# సమైక్య పాలనలో దండుగ..



# సారొచ్చినంక పండుగ

- ఉమ్మడి రాష్ట్రంలో వచ్చీరానీ కరెంటుతో వ్యవసాయం ఆగం
- అప్రకటిత కోతలతో పొలాల వద్ద రాత్రంతా జాగారం చేసినం
- బీఆర్‌ఎస్ సర్కారు హయాంలో వ్యవసాయానికి రందే లేదు
- 24గంటలూ నిరంతర విద్యుత్తుతో పుష్కలంగా పంటలు
- అన్నదాతలకు అండగా నిలిచిన కేసీఆర్‌ను బద్నాం చేయడం తగదు
- స్వరాష్ట్రానికి ముందు, తర్వాత విద్యుత్ పరిస్థితిపై రైతుల మనోగతం

'తెలంగాణ రాష్ట్రం రాకముందు వచ్చీరాని కరెంట్‌తో అరిగోసపడ్డం. ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియక ఎన్నో ఇబ్బందులు పడ్డం. ముఖ్యంగా పంటలకు నీళ్లు పెట్టేందుకు సకాలంలో కరెంటు ఉండక వ్యవసాయం ఆగమైంది. రాత్రిపూట పొలాల దగ్గర జాగారం చేయాల్సి వచ్చేది. సాగునీళ్లు అందక పంటలు పండక ఎంతోమంది రైతులు అప్పులపాలై ప్రాణాలు తీసుకోవాల్సి వచ్చింది. ఇలా దారుణమైన, దుర్భరమైన పరిస్థితులు ఎదుర్కొంటున్న రైతుల జీవితాల్లో వెలుగులు నింపింది కేసీఆర్ ప్రభుత్వమే. స్వరాష్ట్రాన్ని సాధించడమే గాక ముందుచూపుతో ప్రత్యేక చొరవతో 24గంటలూ నిరంతర నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేసి వ్యవసాయానికి ఎలాంటి లోటు లేకుండా చూశాడు. ఆయన వచ్చినంకనే కరెంట్ సమస్యలకు పరిష్కారం లభించింది. ఒక వైపు పెట్టుబడి సాయం, రైతుబీమా.. మరోవైపు సరిపడా సాగునీరు, నిరంతర విద్యుత్తు అందించి రైతును రాజు చేశాడు. కేసీఆర్ హయాంలోనే దర్జాగా పంటలు సాగు చేసుకున్నాం' అంటూ ఉమ్మడి జిల్లా అన్నదాతలు చెబుతున్నారు. తెలంగాణ రాకముందు కరెంట్ సమస్యలతో అరిగోస పడుతుంటే.. కేసీఆర్ వచ్చినంక అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్తు వ్యవస్థను మెరుగుపర్చి రంది లేకుండా చేశారని చెబుతున్నారు. ఇలా ఒక వ్యవసాయమే కాదు.. అన్ని రంగాలను గాడిన పెట్టి 'పవర్‌ఫుల్ తెలంగాణ'గా నిలబెట్టిన కేసీఆర్‌ను.. కాంగ్రెస్ సర్కార్ కావాలనే విద్యుత్ కొనుగోళ్ల విషయంలో బద్నాం చేస్తున్నదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి ఇలాంటి కుట్రపూరిత పోకడలు మానుకొని వ్యవసాయానికి నిరంతరం నాణ్యమైన విద్యుత్తు అందించాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.

- న్యూస్ నెట్‌వర్క్ (నమస్తే తెలంగాణ), జూన్ 23

### గృహాలకూ నిరంతర విద్యుత్తు ఇస్తలేరు..



గృహ అవసరాలకు కూడా నిరంతరవిద్యుత్తు అందిస్తలేరు. రోజుకు సుమారు ఆరు నుంచి పదిసార్లు కరెంట్ కోతలు విధిస్తున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో కరెంట్ కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్తు అందేది. నేడు విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది. గృహ అవసరాలతో పాటు వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్తు అందించాలి.

–బుగ్గరాములు , ఇబ్రహీంపట్నం

### ఆనాటి రోజులొచ్చాయి..



తెలంగాణ రాక ముందు ఏవిధంగా కరెంటు తిప్పలు పడ్డామో మళ్లీ ఇప్పుడు అలాంటి అవస్థలు పడుతున్నాం. ఎప్పుడు కరెంటు వస్తుందో, ఎప్పుడు తీస్తారో తెలియదు. గృహలకూ కరెంటు సరిగా ఇవ్వకపోవడంతో ఉక్కబోతతో ఉడికిపోతున్నాం. రాత్రుల్లో కంటిపై కునుకు ఉండడం లేదు. కాంగ్రెస్ సర్కార్ పాలనలో చిన్నపాటి వర్షం వచ్చినా.. వెంటనే కరెంటు తీస్తున్నారు.


–నవాజోద్దిన్, కొడంగల్

### కేసీఆర్ హయాంలోనే ఫుల్ కరెంట్..



కేసీఆర్ హయాంలోనే వ్యవసాయానికి ఫుల్ కరెంట్ వచ్చింది. పదేండ్ల కింద కాంగ్రెస్ పాలనలో పగలు నాలుగు గంటలు, రాత్రి మూడు గంటలు కరెంట్ వచ్చేది. కేసీఆర్ సార్ సీఎం అయ్యాక కరెంట్ సమస్యలు దూరమయ్యాయి. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో పాత రోజులు మళ్లీ గుర్తుకు వస్తున్నాయి. పాలకులు కుట్రపూరితమైన రాజకీయాలు మానుకొని, వ్యవసాయానికి నాణ్యమైన కరెంట్ అందించాలి.

– రాములుగౌడ్, రైతు, కడ్తాల్ మండలం



# 'నకిలీ'పై నజర్!

**సత్ఫలితాలు ఇస్తున్న గత కేసీఆర్ సర్కారు చర్యలు**

- విస్తృతంగా టాస్క్‌ఫోర్స్ బృందాల తనిఖీలు.. అక్రమార్కుల్లో దడ
- దుకాణాల నుంచి విత్తనాల సేకరణ.. పరీక్షల కోసం ల్యాబ్‌కు తరలింపు
- వచ్చిన ఫలితం ఆధారంగా షాపులపై చర్యలు
- ఏటేటా తగ్గుతున్న నకిలీ విత్తన కేసులు
- ఇప్పటివరకు రంగారెడ్డి జిల్లాలో నాలుగు కేసులే నమోదు



రంగారెడ్డి, జూన్ 23 (నమస్తే తెలంగాణ) : దశాబ్దాల కిందట ఎక్కడ చూసినా నకిలీ విత్తనాలు.. నష్టపోయిన రైతులే కనిపించేవారు.. కానీ, స్వరాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపాక.. విత్తనాల్లో నకిలీల బెడద తగ్గుముఖం పట్టింది. ముఖ్యంగా..బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ కమిటీలు పెను మార్పులు తీసుకొచ్చాయి. పోలీసు కేసులు..పీడీ యాక్ట్‌ల నమోదుతో నకిలీ విత్తన కేసులు తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభు త్వం సైతం గత ప్రభుత్వ విధానాలనే అమలు చేస్తూ పకడ్బందీ చర్యలు తీసుకుంటుండడంతో ఈ సీజన్‌లో జిల్లాలో ఇప్పటివరకు నాలుగే కేసులు నమోదయ్యాయి. అక్రమార్కుల్లో నెలకొన్న దడ..రైతుల్లో వచ్చిన చైతన్యం ఫలితంగా ఒకప్పటి నకిలీల బెడద తీవ్రత ఇప్పుడు లేదన్న మాట అధికార వర్గాల నుంచి సైతం వినిపిస్తున్నది.

### దిగుబడులకు విత్తన ఎంపికే కీలకం ..

రంగారెడ్డి జిల్లాలో వానకాలం సాగును రైతులు 4.45 లక్షల ఎకరాల్లో చేపట్టే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయశాఖ అంచనా వేసింది. అందులో పత్తి 1.76 లక్షల ఎకరాల్లో.. వరి 1.38 లక్షల ఎకరాలు, మొక్కజొన్న 66వేల ఎకరాలు, మిగతా ఎకరాల్లో జొన్న, పెసర్లు, కందులు, మినుములు, వేరుశనగ, ఆముదం తదితర పంటలను రైతాంగం సాగు చేయనున్నది. ఇప్పటికే సాగును మొదలుపెట్టిన రైతులు 53,971 ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. ఇందులో అత్యధికంగా 38 వేల ఎకరాల్లో పత్తిని వేశారు. ఈ క్రమంలో విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లు జోరందుకున్నాయి. మంచి దిగుబడులు సాధించాలంటే విత్తన ఎంపికే కీల కం. ఈ నేపథ్యంలో జిల్లాలో నకిలీ విత్తనాలతో రైతులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నది. దళారులతో సహా దుకాణాల్లోని వ్యాపారులు నకిలీ విత్తనాలు విక్రయించకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

### సీజన్ మొత్తం తనిఖీలు..

నకిలీ విత్తనాలను అరికట్టేందుకు టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లా స్థాయిలో రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ల పరిధుల్లో కలెక్టర్ చైర్మన్‌గా పోలీసు, వ్యవసాయ, సీడ్ కార్పొరేషన్ శాఖలతో సంయుక్తంగా ఏర్పాటుచేసిన టాస్క్‌ఫోర్స్ బృందం యాక్టివ్‌గా పని చేస్తున్నది. అదేవిధంగా డివిజన్ స్థాయిలో ఏడీఏ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ బృందాలు పనిచేస్తున్నాయి. ఇక మండల స్థాయిలో ఏవోల ఆధ్వర్యంలో పోలీస్, రెవెన్యూ శాఖలతో బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నాయి. సీజన్ పొడవునా..ఆయా బృందాలు విత్తనాలు, ఎరువుల షాపుల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. దుకాణాల డీలర్లతో సమావేశాలు నిర్వహించి అమ్మకాల్లో నిబంధనలు పాటించాలని, స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలని సూచిస్తున్నాయి. ఇతర జిల్లాల నుంచి రంగారెడ్డి జిల్లాకు నకిలీ విత్తనాలు తరలించకుండా పటిష్ఠ నిఘాను ఉంచుతున్నాయి. పోలీసుకేసులు, పీడీ యాక్ట్ వంటి భయాలతో అక్రమార్కులు సైతం నకిలీలను విక్రయించేందుకు సాహసించడంలేదు. మరోపక్క సీజన్ ఆరంభంలోనే ఏఈవోలతో ప్రతి గ్రామ పంచాయతీలోనూ రైతులకు నకిలీ విత్తనాలపై అవగాహన సమావేశాలను నిర్వహించారు. గత పదేండ్లుగా తీసుకుంటున్న పటిష్ఠ చర్యలతో మేలు రకమైన విత్తనాలు లభిస్తున్నాయన్న భావన రైతుల నుంచి వ్యక్తమవుతున్నది.

### నిరంతరాయంగా టెస్టులు..

బ్రాండెడ్ మాటున నకిలీ విత్తనాలను రైతులకు అంటగట్టకుండా వ్యవసాయ శాఖ వ్యూహాత్మకంగా ముందుకెళ్తున్నది. వ్యవసాయశాఖ గుర్తించిన అధీకృత కంపెనీ పత్రాలతో పలు కంపెనీలు దరఖాస్తు చేసుకుని ప్రభుత్వం నుంచి అనుమతులు పొందాక బ్రాండెడ్ పేరుతో నకిలీ విత్తనాలను మార్కెట్లోకి తెస్తున్నాయి. మరోవైపు జెర్మినేషన్ సైతం సరిగా లేక రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తున్నది. ఈ పరిస్థితుల నుంచి రైతాంగాన్ని కాపాడేందుకు వ్యవసాయశాఖ జిల్లాలోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసి ర్యాండమ్‌గా పత్తి, వరి వంటి విత్తనాల నమూనాలను సేకరిస్తున్నది. సేకరించిన శాంపిళ్లను హైదరాబాద్‌లోని ప్రయోగశాలకు పంపిస్తున్నది. 15 రోజుల తర్వాత ల్యాబ్ నుంచి వచ్చిన ఫలితాల ఆధారంగా విత్తనాలు సాగుకు అనుకూలం కాకపోతే సదరు షాపుల్లో విక్రయాలను నిలిపివేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కొంతకాలంగా జిల్లా వ్యవసాయశాఖ అధికారి పర్యవేక్షణలో ఆరుగురు ఏడీఏలు, 22 మంది ఏవోలు, 83 మంది ఏఈవోలు ఇదే పనిలో ఉన్నారు. ఇప్పటివరకు 300 వరకు శాంపిళ్లను సేకరించి ల్యాబ్‌కు పంపించారు. ప్రస్తుతానికైతే ఎటువంటి ప్రతికూల ఫలితాలు రాలేదని అధికారులు చెబుతున్నారు.

### పకడ్బందీ చర్యలు..

నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ బృందాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. సీజన్ పూర్తయ్యే వరకూ అన్ని విత్తన దుకాణాల్లో తనిఖీలు చేసి విత్తన నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపిస్తాం. ఫలితాల ఆధారంగా డీలర్లు, సదరు కంపెనీలపై చర్యలు తీసుకుంటాం.

–గీతారెడ్డి, రంగారెడ్డి జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి